## తమిళనాడు సీఎం సంచలన నిర్ణయం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రార్థనా స్థలాలు, విద్యాసంస్థలు, బస్ స్టాండ్‌లకు 500 మీటర్ల పరిధిలో ఉన్న 717 ప్రభుత్వ ఆధ్వర్యంలోని టాస్మాక్ మద్యం దుకాణాలను రాబోయే రెండు వారాల్లోగా మూసివేయాలని ఆదేశించారు. తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ రాష్ట్రవ్యాప్తంగా 4,765 రిటైల్ మద్యం దుకాణాలను నిర్వహిస్తోంది. ఇందులో 717 నిషేధిత జోన్‌లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రెండు వారాల్లోగా వాటిని మూసివేయాలని సీఎం విజయ్ ఆదేశించారు.


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM


## టీవీకే ఎమ్మెల్యేకు కోర్టు షాక్



**అక్షరటుడే, తమిళనాడు :** తమిళనాడు ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో గెలిచిన టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతికి మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. బలపరీక్ష ఓటింగ్‌లో పాల్గొనవద్దని ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో పొరపాటు జరిగిందని శ్రీనివాస సేతుపతిని ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించకుండా ఆపాలని డీఎంకే నేత, సమీప అభ్యర్థి పెరియకరుప్పన్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఆయన శాసనసభ కార్యకలాపాలలో పాల్గొనకుండా మంగళవారం నిషేధం విధించింది.


12-5-2026 (Tuesday) | MAIN EDITION


## అన్నాడీఎంకేలో చీలిక



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అన్నాడీఎంకే పార్టీలో విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకోగా.. సీవీ షణ్ముగం వర్గం సీఎం విజయ్‌కు బహిరంగ మద్దతు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. ఆయన వెంట 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

## చైనాపై ట్రంప్ ప్రశంసలు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు చైనా పర్యటనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చైనా అద్భుతమైన దేశం అని అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే నాయకుడిగా ట్రంప్ పేర్కొన్నారు.

## అస్సాం సీఎం ప్రమాణ స్వీకారం



**అక్షరటుడే, అస్సాం :** అస్సాం ముఖ్యమంత్రిగా మంగళవారం హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. గువహటిలోని ఖానాపరా వెటర్నరీ మైదానంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన రెండో సారి సీఎంగా ప్రమాణం చేశారు. ఆయనతో పాటు నలుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.



## నీటి సంపులో పడి బాలిక మృతి

**అక్షరటుడే, హైదరాబాద్ :** నీటి సంపులో పడి మృతి 13 ఏళ్ల బాలిక మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని మియాపూర్ పరిధిలో ఓ అపార్ట్‌మెంట్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. భద్రాది కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మద్దిరాల తండాకు చెందిన చరణ్, రేణుక దంపతులు బతుకు దెరువు కోసం హైదరాబాద్ నగరానికి వలస వచ్చారు. చరణ్ వారం క్రితమే శ్రీరెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో పనికి చేరాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో వారి కుమార్తె సారా అపార్ట్‌మెంట్ ఆవరణలో మూత తీసి ఉన్న నీటి సంపులో పడి చనిపోయింది.

## బాలుడిపై వీధికుక్కల దాడి

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఆడుకుంటున్న బాలుడిపై 10 వీధి కుక్కలు దాడి చేశాయి. మీర్‌పేట్‌లోని టీచర్స్ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంటి సెల్లార్ పరిధిలో ఆడుకుంటున్న చిన్నారి అద్విక్‌పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# నీట్ పరీక్ష రద్దు

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ రద్దు చేసింది. మే 3న జరిగిన పరీక్షకు లక్షలాది విద్యార్థులు హాజరయ్యారు. ప్రశ్నపత్రం లీక్ అయిందనే ఆరోపణలతో ఎన్టీఏ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో పరీక్ష రద్దు చేయాలని నిర్ణయించామని పేర్కొంది. ఈ పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని, త్వరలో తేదీలను ప్రకటిస్తామని తెలిపింది. - అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి




- ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలతో..
- ఎన్‌టీఏ చర్యలు
- మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడి
- సీబీఐ విచారణకు ఆదేశించిన కేంద్రం

ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు వైద్య కాలేజీల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ ఏడాది మే 3న ఎన్‌టీఏ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది హాజరయ్యారు. అయితే రాజస్థాన్‌లో నీట్ క్వశ్చన్ పేపర్ లీక్ అయిందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఎన్‌టీఏ ప్రాథమిక విచారణలో పేపల్ లీక్ అయినట్లు తేలడంతో పరీక్షను రద్దు చేస్తున్నట్లు తెలిపింది. కాగా పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది.

### అసలు ఏం జరిగిందంటే..

మే 3న దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష నిర్వహించగా, మే 2 రాత్రే కొందరు విద్యార్థులకు ఒక 'గెస్ పేపర్' సర్క్యులేట్ అయింది. పరీక్ష పూర్తయ్యాక ఆ గెస్ పేపర్‌లోని ప్రశ్నలను అసలు ప్రశ్నపత్రంతో పోల్చి చూడగా కీలక విషయాలు వెలుగు చూశాయి. అసలు ప్రశ్నాపత్రంలోని 410 ప్రశ్నలలో ఏకంగా 120 జువాలజీ, కెమిస్ట్రీ ప్రశ్నలు వరుస క్రమంతో సహా సేమ్ ఉండటం తీవ్ర కలకలం రేపింది. దీంతో ప్రశ్నాపత్రం లీక్ అయిందని పలువురు విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు సికార్‌లోని ఉద్యోగ్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అనంతరం రాజస్థాన్ డీజీపీ ఆదేశాల మేరకు రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, యాంటీ టెర్రరిజం స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. ప్రశ్నపత్రం ఎలా లీక్ అయింది, దీనికి వెనుక ఉన్న నెట్వర్క్ ఎవరు అనే కోణాల్లో అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలోనే పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది.

### పారదర్శకత కోసం..

పోలీసులు, అధికారులు పంచుకున్న సమాచారాన్ని సమీక్షించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. అన్ని ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత పరీక్షను కొనసాగించడం సాధ్యం కాదని ఎన్‌టీఏ అధికారిక ప్రకటనలో పేర్కొంది. జాతీయ పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడటానికి పరీక్షను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు 'గెస్ పేపర్' లీక్‌పై 45 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు విచారణకు సీబీఐకి సహకరిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. దీనిపై ఇప్పటికే రాజస్థాన్ పోలీసులు రాజస్థాన్‌తోపాటు ఉత్తరాఖండ్, సికార్, డెహ్రాడూన్, మహారాష్ట్రసహా పలు ప్రాంతాల్లో సోదాలు ప్రారంభించారు.

## 21న రాష్ట్ర కేబినెట్ సమావేశం..



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 21న నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లు, అకడమిక్ క్యాలెండర్, పంటల మార్పిడి విధానం, ఫీజుల నియంత్రణతో పాటు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు వంటి పలు కీలక అంశాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారు.

## ధాన్యం సేకరణపై సీఎం సమీక్ష



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు తలెత్తవని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంటా చేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లారీల కొరత ఉంటే దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలన్నారు.

## నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో ఉద్రిక్తత

**అక్షరటుడే, ఏపీ :** గుంటూరు జిల్లాలోని నిడుబ్రోలు రైల్వే స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి కలకలం రేగింది. రైల్వే సిగ్నల్ వ్యవస్థను ట్యాంపరింగ్ చేసేందుకు కొందరు దుండగులు ప్రయత్నించారు. వారిని అడ్డుకునేందుకు వెళ్లిన రైల్వే పోలీసులపై రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం దుండగులు పారిపోయారు. వారికోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.





## మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడి లొంగుబాటు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ తన భార్యతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలోని సోమిడి గ్రామానికి చెందిన నరహరి.. 1996లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన నరహరి.. చివరకు మావోయిస్టు పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక విభాగమైన కేంద్ర కమిటీలో స్థానం సంపాదించారు. అలాగే ఝార్ఖండ్ ఈస్ట్ రీజినల్ బ్యూరో టెక్నికల్ విభాగానికి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఆయన లొంగిపోయారు.



## విడాకులు తీసుకోనున్న మౌనీ రాయ్!

**ప్రముఖ బాలీవుడ్ నటి మౌనీ రాయ్ తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోబోతున్నారనే ప్రచారం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా విభేదాలు ఉన్నాయని, త్వరలోనే అధికారికంగా విడాకుల ప్రకటన వచ్చే అవకాశముందనే ఊహాగానాలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. మౌనీ రాయ్, సూరజ్ నంబియార్ సోషల్ మీడియాలో ఒకరినొకరు అన్‌ఫాలో చేసినట్లు నెటిజన్లు గుర్తించారు. అంతేగాకుండా తమ పెళ్లికి సంబంధించిన ఫొటోలను కూడా ఖాతాల నుంచి తొలగించారు.** - అక్షరటుడే, సినిమా డెస్క్





## కేసీఆర్ కీలక సమావేశం

**అక్షరటుడే, సిద్దిపేట:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ నాయకులతో మంగళవారం కీలక సమావేశం నిర్వహించారు. ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో జరిగిన సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జీవన్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు హాజరు అయ్యారు. పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం లాంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై పలు సూచనలు చేశారు.